క్లుప్తంగా

'రైతుల గోస కాంగ్రెస్‌కు పట్టదా?'

జెడ్పీసెంటర్(మహబూబ్ నగర్): యూరియా కోసం రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజు అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యూరియా కోసం క్యూలైన్‌లో ఓ వ్యక్తి మూర్ఛ వచ్చి పడిపోతే.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అతడిని ఆస్పత్రికి తరలించడం పాపమా అని ప్రశ్నించారు. సరైన సమయంలో యూరియా ఇస్తే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వాన్ని అడుగుతుంటే రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అనడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ఆంజనేయులు, గణేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, గణేశ్, నవకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సర్వే

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలోని దళితవాడల్లో నెలకొన్న సమస్యలపై ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు 8మండలాలు, 100 గ్రామాల్లో సర్వేలు చేయాలని నిర్ణయించామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య తెలిపారు. శనివారం స్థానిక కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో సంఘం కార్యవర్గ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సర్వే అనంతరం సెప్టెంబర్ 8, 9వ తేదీల్లో మండల కార్యాలయం ఎదుట ధర్నాలు చేపడతామన్నారు. సమావేశంలో కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి ఆదివిష్ణు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

నవాబుపేట: మండలంలోని కారుకొండకు చెందిన రమేశ్‌ను వివిధ రకాల కేసుల విషయంలో అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్ చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. గ్రామంలో పలు వివాదాల్లో తలదూర్చి గొడవలు పడడంతోపాటు కొందరిని వివిధ రకాలుగా మోసం చేసిన ఆరోపణలు ఉన్నాయి. వీటిలో కొందరి ఫిర్యాదు మేరకు శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు. కాగా వివిధ రకాల రుణాలు ఇప్పిస్తానంటూ కొందరితో డబ్బులు తీసుకుని మోసం చేసిన ఆరోపణలు కూడా ఉన్నాయి. అతని వల్ల మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని పోలీసులు ప్రకటించారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



గండేడ్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ప్రధానవక్త నరేందర్‌రెడ్డి, సత్యసాయి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెన్నాచేడ్‌లో హనుమాన్ చాలీసా పారాయణం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. అనంతరం స్వామివారికి మహా నైవేద్యం నివేదించారు. మంగళహారతితో హనుమాన్ చా లీసా పారాయణానికి ముగింపు పలికారు. అలా గే శివాలయంలో నిర్వహించే రుద్రాభిషేకం, షిరిడీ సాయి ఆలయంలో నిత్యాభిషేకం ముగించారు.

యూరియా పంపిణీలో విఫలం



మన్యంకొండ వద్ద యూరియా పంపిణీ కేంద్రం వద్ద సరఫరాపై రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్/హన్వాడ: రైతులకు యూరియాను పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శనివారం హన్వాడ, మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ మండలాల పరిధిలోని యూరియా పంపిణీ కేంద్రాలను మాజీ మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేయకపోగా, వారి గురించి మంత్రులు చులకనగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. నాటువేసిన పదిరోజుల్లో యూరియా వేయాల్సి ఉంటుందని, యూరియా వేయకుంటే దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ అధికారుల వద్ద పంటల సాగు వివరాలు ఉంటాయని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేసిన తప్పునకు ప్రతిఫలంగా ఉచితంగా యూరియా ఇవ్వాలని, అలాగే నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలోని జిల్లా సహకార విక్రయ కేంద్రం వద్ద నవాబుపేట మండలం కాకర్లపహాడ్‌కు చెందిన ఆంజనేయులు మూర్ఛవచ్చి పడిపోయాడని, ఆయన చనిపోతే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వ్యక్తికి మూర్ఛవచ్చిన విషయం 108కు ఫోన్ చేసినా సమయానికి రాకపోవడం విడ్డూరంగా ఉందని, గిఫ్ట్ ఏ స్మైల్ కింద తామిచ్చిన అంబులెన్స్‌లపై తమ ఫొటోలు తొలగించి ప్రస్తుత ప్రజాప్రతినిధులు ఫొటోలు పెట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని, సమాజంలోని ప్రతిఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం తీరు ఉమ్మడి ఏపీలోని పరిస్థితులను గుర్తుకు తెస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మహబూబ్‌నగర్ రూరల్ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, హన్వాడ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, బాల్‌రాజు, ఎఫ్ఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు కాదు.. అతను రిక్షా వాలా

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద యూరియా విక్రయ కేంద్రం (డీసీఎంఎస్) ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని, నవాబుపేట మండలం కాకర్లపహాడ్‌కు చెందిన రిక్షా నడిపే వ్యక్తికి మూర్ఛ రావడంతో కొంతమంది చుట్టుపక్కల వారు చూసి పడుకోబెట్టారని డీఏఓ వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పృహ వచ్చిన తర్వాత వివరాలు అడిగితే ఎలాంటి పొలం లేదు.. నేను రిక్షా తోలుకుంటానని తెలిపినట్లు పేర్కొన్నారు.

విప్లవోద్యమానికి సురవరం మృతి తీరని లోటు





సీపీఎం, సీపీఐ కార్యాలయాల్లో సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు పార్టీల నాయకులు

- సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో సంతాప సభలు
- సుధాకర్‌రెడ్డి సేవలను కొనియాడిన కమ్యూనిస్టులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భారత విప్లవోద్యమానికి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటని సీపీఐ, సీపీఎం నాయకులు కొనియాడారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయా పార్టీల జిల్లా కార్యాలయాల్లో పార్టీలశ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులతో కలిసి సంతాప సభలు నిర్వహించారు. సురవరం వెంకట్రామిరెడ్డి భవన్ సీపీఐ కార్యాలయం, సీపీఎం జిల్లా కార్యాలయంలో కమ్యూనిస్టు దిగ్గజం, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ జయలక్ష్మి మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు తీరనిలోటన్నారు. సురవరం ఆశయాల సాధనకు పార్టీశ్రేణులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణరెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు పరమేశ్వర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి బాలకిషన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లెగోపాల్, కురుమూర్తి, చంద్రకాంత్, దీప్లానాయక్, రాజ్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో నివాళులర్పిస్తున్న నాయకులు

- దేవరకద్రతోపాటు, చిన్నచింతకుంట జీపీ కార్యాలయ ఆవరణలో ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు భార్గవి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్ సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కృష్ణా నీటివాటాలో కీలక పాత్ర

పాలమూరు: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని లోటని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ప్రకటనలో తెలిపారు. కృష్ణానది నీటివాటా విషయం, ఇతర ప్రజాఉద్యమాల్లో ఆయన పాత్ర ఎప్పటికీ గుర్తుంటుందని తెలిపారు.

యూరియా తిప్పలు.. ఇంతింతకాదయా



ప్రైవేట్ దుకాణం ఎదుట రైతుల క్యూలైన్

నవాబుపేట: యూరియా కోసం రైతులు ప్రైవేట్ దుకాణాలకు ఎగబడ్డారు. రెండురోజులపాటు పీఏసీఎస్ కేంద్రంలో యూరి యా అందుబాటులో ఉండగా.. శనివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ దుకాణం ఆగ్రో కేంద్రంలో యూరియా అందుబాటులో ఉంచారు. దీంతో రైతులు ఎగబడి మరీ యూరియా బస్తాలు తీసుకెళ్లారు.



అప్పంపల్లి పీఏసీఎస్ వద్ద చెప్పలను క్యూలైన్లో ఉంచిన రైతులు

చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లి పీఏసీఎస్ ఎదుట శనివారం యూరియా కోసం రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, చెప్పులను క్యూలై న్లో ఉంచారు. శుక్రవారం 300 బస్తాల యూరియా రావడంతో శనివారం రైతులకు అందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్ మండలాల్లోని 32మంది లబ్ధిదారులకు రూ.13.22లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దవిజయ్‌కుమార్, నాయకులు సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, కృష్ణయ్య, మహేందర్, రాఘవేందర్, నవనీత, సుధాకర్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, యాదిరెడ్డి, రాజుగౌడ్, శ్రీను, వెంకటయ్య, మోహన్, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రేరణా తరగతులు

నియోజకవర్గంలోని 27ఉన్నత పాఠశాలలను మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందశాతం కార్యక్రమానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు పదో తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మెరీట్ సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు తమ పాఠశాలల్లో లిటిల్ టీచర్స్‌గా పనిచేస్తారని వందేమాతరం ఫౌండేషన్ సభ్యుడు అనిల్ తెలిపారు. శిక్షణా తరగతులకు 277మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.



ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్న వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధి

లైన్‌మెన్‌కు మెమో

గండేడ్: ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి కారణమైన లైన్‌మెన్‌కు మెమో జారీ చేయడమే కాక పూర్తిస్థాయి విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. రెడ్డిపల్లికి చెందిన సోమభూపాల్ రెడ్డి గండేడ్ మండల కేంద్రంలో వాటర్ ఫిల్టర్ నిర్వహిస్తున్నాడు. బిల్లు కట్టకపోవడంతో గురువారం లైన్‌మెన్ మన్నాజీ విద్యుత్ కనెక్షన్ తొలగించారు. శుక్రవారం ఉదయం అతను సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి మొత్తం బిల్లు కట్టాడు. విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించాలని లైన్‌మెన్‌ను కోరగా.. అతను దాటవేస్తూ వచ్చాడు. దీంతో మనస్తాపానికి గురై సబ్‌స్టేషన్ ఎదుటే గడ్డిమందు తాగాడు. దీంతో అంబులెన్సులో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆగ్రహించి డీఈ లక్ష్మణ్, ఏఈ శ్రీకాంత్‌ను ఆరా తీశారు. లైన్‌మెన్‌పై పూర్తి విచారణ చేపట్టి నివేదిక పంపాలని ఏఈని డీఈ ఆదేశించారు. దీంతోపాటు అతనికి మెమో జారీ చేయాలని సూచించడంతో లైన్‌మెన్ మన్నాజీకి ఏఈ మెమో జారీ చేశారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏఈ తెలిపారు.

సాంకేతిక రంగాలపై అవగాహన అవసరం

రాజాపూర్: శాస్త్ర, సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని విశ్రాంత హెచ్ఎం నర్సోజీ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా మోడల్ ప్రాజెక్టును తయారు చేసి అవగాహన కల్పించారు. కంప్యూటర్ యుగంలో చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఎల్లయ్య పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు

భూత్పూర్: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి మహబూబ్‌నగర్, కొత్తకోట, వనపర్తి, పెబ్బేరు కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రి భూత్పూర్ చౌరస్తాలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. మండలంలోని మద్దిగట్ల, ఎల్కిచర్లలో కొలువుదీరిన శ్రీకృష్ణుడి ప్రతిమ జ్ఞాన రీత్యా నిత్యపూజలు, భగవద్గీత శ్లోక పారాయణం, అనంతరం భూత్పూర్ చౌరస్తాలో మహిళలు నృత్యాలు పలువురిని ఆకట్టుకుంది. త్రైతసిద్ధాంత ప్రబోధ కమిటీ అధ్యక్షుడు నాగ్యానాయక్, వనపర్తి కమిటీ అధ్యక్షుడు మహేశ్, పెబ్బేరు కమిటీ అధ్యక్షుడు హజూర్‌తోపాటు మహిళలు పాల్గొన్నారు.

విద్రోహదినంగా..

మిడ్జిల్: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. శనివారం సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 23ను విద్రోహదినంగా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి, కరుణాకర్, శివప్రసాద్, రాజేశ్ ఉన్నారు.

రేకుల షెడ్డుకు భూమిపూజ

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయం వద్ద దిగుడు మెట్లపైన రేకుల షెడ్డు ఏర్పాటుకు దాత మదనాపురం మండలం కొత్తపల్లికి చెందిన మాసన్న ముందుకొచ్చారు. అందుకు శనివారం ఆలయం వద్ద భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు బహూకరణ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్ జెడ్పీహెచ్ఎస్ గ్రంథాలయానికి పాలమూరు యువ కవుల వేదిక, పాలమూరు సాహితి, ఫ్రెండ్స్ యువసేన ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రముఖ కవుల రచనలు, పాలమూరు జిల్లా కవుల రచనలను వందకు పైగా పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా గజల్ సాహిత్యంలో విశేషమైన సేవ చేస్తున్న ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవి వెంకటేశ్వరశర్మకు సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం వచ్చినందుకు సన్మానం చేశారు.

స్పందించారు.. చదును చేయించారు

సాక్షి ఎఫెక్ట్..

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి నుంచి రాయపల్లి వరకు బీటీరోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారడంతో 'భారీగుంతలు.. భయంగా రాకపోకలు' అంటూ 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. రాజాపూర్ ఎస్ఐ శివానందంగౌడ్ స్పందించి శనివా రం గుంతల రోడ్డును పరిశీలించి టిప్పర్లతో మట్టిని తెప్పించి గుంతలను చదును చేయించారు. ముదిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి పక్కనున్న సర్వీస్‌రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో మట్టిని పోయించి వాహనాలు వెళ్లేలా చేయించారు. ఎస్ఐ పనితీరును రూరల్ సీఐ నాగార్జునగౌడ్ అభినందించారు. అంతేకాకుండా మట్టిపోసి లెవల్ చేయిస్తే వర్షం వస్తే మట్టి కోసుకుపోయే అవకాశం ఉందని సీఐ చెప్పడంతో మాజీ ఎంపీటీసీ శేఖర్‌గౌడ్ వెంటనే సిమెంట్ పైపులను తెపించారు. సిమెంట్ పైపులు వేసి సర్వీస్ రోడ్డును పునఃరుద్ధరించి వాహనాలు సర్వీస్ రోడ్డులోనే వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.



ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



మూసాపేటలో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం మూసాపేట మండలంతోపాటు మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని గాజులపేట, ఇప్పలపల్లికి చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3,625 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఇందులో 2,100 ఇళ్ల బేస్‌మెట్ పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే రెండో విడత ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు.

3న మూసాపేటకు సీఎం రాక

వచ్చేనెల 3వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి మూసాపేటకు రానున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు. అదేరోజు వేముల ఎస్‌జీడీ ఫార్మా వద్ద కొత్త యూనిట్‌ను ప్రారంభిస్తారన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, బాలనర్సింహులు, గోవర్ధన్, సత్యం, చంద్రశేఖర్, రాంచందర్, యాదయ్య, ఎన్‌టీగౌడ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

- రూ.9.92కోట్ల పనులపై సమీక్ష
- రూ.83, 962 రికవరీకి ఆదేశాలు
- రూ.21వేల వరకు జరిమానాలు

దేవరకద్ర: ఉమ్మడి మండలంలోని 31గ్రామాల్లో 2024-25లో చేసిన పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా అధికారుల సమక్షంలో జరిగిన ప్రజావేదికలో గ్రామాలవారీగా జరిగిన పనులపై చర్చించారు. ఒక్కో గ్రామంలో చేసిన పనులపై తనిఖీ బృందం చదివి వినిపించింది. 2024 ఏప్రిల్ 1వ తేదీనుంచి 2025 మార్చి 31వరకు రూ.9, 92, 33, 152 ఖర్చయినట్లు నివేదికలు సమర్పించారు. కూలీల వేతనం కింద రూ.5కోట్ల 84లక్షల 90వేలు, మెటీరియల్ కింద రూ.4కోట్ల7లక్షల43వేలు ఖర్చు చేసినట్లు నివేదికలు ఇచ్చారు. పనులు సక్రమంగా చేయనివారి నుంచి రూ.83, 962 రికవరీకి నోటీసులు జారీ చేశారు. రూ.21వేల వరకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పీడీ నర్సింహులు, ఏపీడీలు ముషాయిదాబేగం, జిల్లా అధికారులు ప్రేమలత, మంజుల, శృతి, సంతోషి, మండల అధికారులు పాల్గొన్నారు.



పనులపై సమీక్షిస్తున్న జిల్లా అధికారులు

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు, సీపీఎం నాయకుడు జగన్ ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం కిష్టంపల్లిలో సమస్యలు పరిశీలించాలని డిమాండ్ చేస్తూ.. కార్యదర్శి సత్యమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నఆదిరాల, గోప్లాపూర్, కురువగడ్డపల్లి, బూర్గుపల్లి, మల్లెబోయిన్‌పల్లి, మాచారం, ఆలూరులో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించామన్నారు. సర్వేలో అనేక విషయాలు వెలుగు చూశాయన్నారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో యాదయ్య, శ్రీశైలం, కృష్ణయ్య, చెన్నయ్య, నర్సింహులు, రాంచంద్రయ్య, భీమయ్య, జయరాములు, సాయిలు, శ్యాంసుందర్, శంకర్, చెన్నకేశవులు, జంగయ్య, బాలయ్య, మణెమ్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ



జట్టుకు షీల్డు అందజేసిన చైర్‌పర్సన్, ఎంఈఓ

జడ్చర్ల టౌన్: జడ్చర్ల క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ శనివారంతో ముగిసింది. విజేతగా స్వామినారాయణ గురుకుల్ పాఠశాల నిలువగా.. రన్నరప్‌గా శ్లోకా పాఠశాల నిలిచింది. శనివారం జడ్చర్ల మినీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్వామి నారాయణ గురుకుల్, శ్లోక పాఠశాలలు తలపడ్డాయి. గురుకుల్ జట్టులో ఓపెనర్ విఘ్నేశ్ 52బంతుల్లో 102 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గురుకుల్ జట్టు నిర్ణీత 15ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 165 పరుగులు చేసింది. జట్టులో విఘ్నేశ్ 52బంతుల్లో 102 పరుగులు, ప్రణయ్‌రెడ్డి 39 బంతుల్లో 51 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్లోకా జట్టు నిర్ణీత 15ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 94పరుగులు చేసింది. జట్టులో అర్హాన్ ఒక్కడే 43పరుగులు చేశాడు. విఘ్నేశ్ మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్‌గా నిలువగా.. బెస్ట్ బౌలర్‌గా వంశీగౌడ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ విఘ్నేశ్ (టోర్నీలో 2సెంచరీలు), ఎమర్జింగ్ ప్లేయర్‌గా ఆతిఫ్, మాన్ ఆఫ్ ద సిరీస్ కేతన్‌కుమార్‌యాదవ్ నిలిచారు. విజేత, రన్నరప్ జట్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత ఎంఈఓ మంజులాదేవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు తరలిరండి

జడ్చర్ల టౌన్: బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు సాధనే లక్ష్యంగా సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని బీసీజాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎమ్మార్పీ కార్యాలయం వద్ద ఉన్న జ్యోతిబాపూలే, సావిత్రీభాయిపూలే విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 25న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేపడుతున్న సత్యాగ్రహ దీక్షకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీసీటీపీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్‌ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని చేపడుతున్న దీక్షకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ టోర్నీకి అవకాశం కల్పించండి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీ బాలుర హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ అండర్-17 బాల, బాలికల టోర్నీ నిర్వహణకు అవకాశం కల్పించాలని శతాబ్ది ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, పీడీ శారదభాయికి శనివారం జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో హెచ్ఎం, ఎంఈఓ మంజులాదేవి సమక్షంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, ఉపాధ్యక్షులు సత్యం, ప్రకాశ్‌చారి, గోపాల్, శ్రీనివాస్‌చారి, ఆర్గనైజింగ్ సెక్రటరి ఆనంద్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి కృష్ణ పాల్గొన్నారు.

'మాజీ మంత్రి డ్రామాను ప్రజలు నమ్మరు'



స్టేషన్ మహబూబ్‌నగర్: యూరియాపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేసిన డ్రామాను ప్రజలు నమ్మరని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు యూరియాను సకాలంలో అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, ఈ విషయంలో గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసిన శ్రీనివాస్‌గౌడ్‌కు తెలియదా అని ప్రశ్నించారు. సమావేశంలో సురేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దవిజయ్‌కుమార్, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

మిడ్జిల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే నేరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు నరేశ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, తిరుపతయ్య, వెంకట్‌రెడ్డి, నరేందర్, వాసుయాదవ్, శేఖర్, నరేశ్, వెంకటయ్య, అంజి, దామేదర్‌రెడ్డి, భీమయ్య, సతీశ్ ఉన్నారు.

'మార్వాడీలు.. మా సోదరులే'

జడ్చర్ల: తెలంగాణలో వ్యాపారాలు కొనసాగిస్తున్న మార్వాడీలు గోబ్యాక్ అంటూ స్థానిక వ్యాపారులు నినదిస్తున్న క్రమంలో జడ్చర్ల ఆల్ మర్చంట్ అసోసియేషన్ మాత్రం మార్వాడీలను సమర్థిస్తూ వారు తమకు సోదరులంటూ.. వారి వ్యాపారాలకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. శనివారం జడ్చర్ల ఆల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త మధు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మార్వాడీలకు మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో పరమేశ్వర్, నవకుమార్, రాఘవేందర్, ముజుబుద్దీన్, వీరేశ్, లవకుమార్, బాలరాజు, నరేశ్, శర్మ, భగవాన్, గంగులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిర్వహించాలి

గండేడ్: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్ రావు, మహమ్మదాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గండేడ్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు భక్తిభావానికి సంబంధించినవన్నారు. విగ్రహాలను ప్రతిష్ఠించే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ జనార్దన్, ఆర్ఐ యాసి న్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ తపస్ సంఘం నాయకులు అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు వినతి పత్రం అందజేశారు. ఓపీఎస్ పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కోరారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

దేవరకద్ర: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని శనివారం తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తిరపతయ్య, సుశీల, సుధాలక్ష్మి, సురేశ్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమావాస్యతో పాటు ఆఖరి శ్రావణ శనివారం పురస్కరించుకుని స్థానిక కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని విజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగరాజుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అంజన్న ఉత్సవాలు



దేవరకద్ర రూరల్: శ్రావణమాస చివరి శనివారాన్ని పురస్కరించుకొని నాగారంలోని ఆంజనేయస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే స్వామి వారి విగ్రహాన్ని భజన కీర్తనలను ఆలపిస్తూ పురవీధుల్లో ఊరేగించారు. గోపన్‌పల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో నెలరోజులపాటు అఖండ దీపారాధన నిర్వహించారు. శనివారం గ్రామస్తులు గ్రామంలోని బావి దగ్గరకు వెళ్లి బిందెలలో నీటిని తీసుకొచ్చి అభిషేకం నిర్వహించారు.

కొమిరెడ్డిపల్లిలో చెన్నకేశవస్వామి జాతర

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గుట్టపై వెలసిన చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఒకరోజు జాతరను నిర్వహించారు. శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద జాతర జరిగింది. అనంతరం స్వామివారి పాదాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. గుట్టపై ఆలయంలోంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో భజనలు చేస్తూ గుట్ట కిందకు తెచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన ఉట్ల కమాన్ వద్ద ఉత్సవ విగ్రహాలను ఉంచి ఉట్టి కొట్టారు.

రేపు టీఎల్ఎం మేళా

నవాబుపేట: విద్యార్థుల మేథాశక్తిని పరీక్షించేలా వారికి మరింత చేయూతనిచ్చేలా చేపట్టే టీఎల్ఎం మేళా కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.